క్లుప్తంగా

ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన ఏఎస్పీ



ఎస్పీ రాజేంద్రప్రసాద్‌కు మొక్క అందజేస్తున్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేట క్రైం : సూర్యాపేట జిల్లా ఎస్పీగా రాజేంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం ఏఎస్పీ నాగేశ్వర్‌రావు ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు, ప్రభుత్వ అధికారులు, మీడియా భాగస్వామ్యంతో ఉత్తమంగా సేవలు అందిస్తున్నామని ఎస్పీ తెలిపారు. అదే విధంగా ఎస్పీకి డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా బుడిగె మల్లేష్



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బుడిగె మల్లేష్‌యాదవ్ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మల్లేష్‌యాదవ్‌ను నియమిస్తున్నట్లు బుధవారం ప్రకటించారు.

దుర్గాదేవి ఉత్సవాలను విజయవంతం చేయాలి



ఉత్సవాల కరపత్రాలు విడుదల చేస్తున్న సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్

పెన్‌పహాడ్ : మండలంలోని లింగాల గ్రామంలో ఈనెల 15నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే శ్రీకనకదుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్ మామిడి వెంకన్న, దేవాలయ కమిటీ చైర్మన్ కేశిరెడ్డి కోటిరెడ్డి కోరారు. బుధవారం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నల్ల శ్రీనివాస్, పురోహితులు ఇరువంటి సత్యనారాయణశర్మ, మామిడి శ్రీనివాస్, ఏసురాజు దుర్గయ్య, గార్లపాటి జగన్‌రెడ్డి, రంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, నల్లపు వెంకటేశ్వర్లు, మామిడి చంద్రం, నూకల వెంకటేశ్వర్లు, సలిగంటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రధాని మోదీ అండ

తుంగతుర్తి : రైతులకు అండగా ప్రధాని మోదీ ఉన్నారని బీజేపీ నాయకురాలు ఝాన్సీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు తెలంగాణ ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో పసుపు బోర్డును ఏర్పాటు చేసి పసుపు రైతులను కేంద్రం ఆదుకుంటుందన్నారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారి దళితులను రాష్ట్రపతిని చేశారని, రెండోసారి గిరిజన మహిళను రాష్ట్రపతిని చేశారని అన్నారు. ఆమె వెంట బీజేపీ నాయకులు సాయిబాబు, మహేందర్, రఫీక్, సైదులు తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయం వద్ద తెలంగాణ విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం జిల్లా నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అబ్బోజు సతీష్‌కుమారాచార్యులు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చొల్లేటి శ్రీకాంతాచార్యులు, ఉపాధ్యక్షుడిగా తంగెళ్లపల్లి శ్యాంసుందరాచార్యులు, ప్రధాన కార్యదర్శులుగా పరిపూర్ణాచార్యులు, భాస్కరాచార్యులు, సహాయ కార్యదర్శులుగా నితీన్ శాస్త్రి, విశ్వనాథం, కోశాధికారిగా బ్రహ్మాండ్లపల్లి యాకుబాచార్యులు ఎన్నికయ్యారు.

ముమ్మరంగా బతుకమ్మ ఘాట్ ఏర్పాటు పనులు

అర్వపల్లి : బతుకమ్మ వేడుకలు ఈనెల 14నుంచి ప్రారంభంకానుండడంతో అర్వపల్లిలో కొత్తకుంట పక్కన బతుకమ్మ ఘాట్ ఏర్పాటు పనులను ముమ్మరంగా చేస్తున్నారు. బుధవారం కొత్తకుంట పక్కన ఉన్న స్థలాన్ని అర్వపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చదును చేయించి సిద్ధం చేసే పనులు ప్రారంభించారు. అలాగే ఘాట్ చుట్టూ విద్యుత్ లైట్లు ఏర్పాటు, ఇతర వసతులు కల్పిస్తున్నట్లు సర్పంచ్ బైరబోయిన సునీతారామలింగయ్య తెలిపారు.

వరికి తెగుళ్ల బెడద!

- ఆశిస్తున్న మొగి పురుగు, తాటాకు తెగులు
- ఎకరానికి రూ.3వేలు అదనపు పెట్టుబడి ఖర్చులు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందంటున్న రైతులు



వరికి సోకిన తాటాకు తెగులు

పెన్‌పహాడ్ : వరి పంటకు ఆశిస్తున్న తెగుళ్లు రైతులను కుదేలు చేస్తున్నాయి. తెగుళ్ల నివారణకు రకరకాల క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వరి పంటకు ఆశిస్తున్న వరుస తెగుళ్లతో పెట్టుబడి ఖర్చులు పెరగడంతో పాటు దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, తెగుళ్లతో తగ్గుతున్న దిగుబడి కారణంగా అన్నదాతలు నష్టాల్లో కూరుకుపోనున్నారు.

ఆందోళనలో అన్నదాతలు..

మండలంలో అంతంత మాత్రంగా ఉండే సాగునీటితో పలువురు రైతులు వరిసాగు చేపడుతున్నారు. ఈసారి వానాకాలంలో మండలంలో 25,400 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఆలస్యంగా కురిసిన వర్షాలతో చెరువులు, కుంటల కింద సైతం ఈసారి వరిని సాగు చేశారు. బోర్లు, బావులు మోటార్ల కింద ముందస్తుగా సాగు చేసిన వరి పంటలు ప్రస్తుతం పొట్టదశంలో ఉండగా చెరువులు, కుంటల కింద ఆలస్యంగా మొదలైన వరి పంటలు మరికొన్ని రోజుల్లో పొట్టదశకు చేరుకోనున్నాయి. వాతావరణ పరిస్థితులు, ఆలస్యంగా వరినాట్లు వేయడం వంటి కారణాలతో సాధారణంగా వరిలో తాటాకు తెగులు, అగ్గితెగులు, కాటుక తెగులు, మొగి పురుగు, ఆకు ఎండు తెగులు వంటివి సోకుతాయి. వరి నాట్లు వేసిన కొద్ది రోజులకే పంటలకు అగ్గి తెగులు ఆశించడంతో పంటలు ఎర్రబారిపోయాయి. దీంతో రైతులు క్రిమిసంహారక మందులు పిచికారీ చేశారు. ప్రస్తుతం వరి పంటలకు మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వరుస తెగుళ్ల బారిన పడుతుండటంతో వాటి ప్రభావం దిగుబడిపై చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులను సంప్రదించి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు.

పెరుగుతున్న పెట్టుబడి వ్యయం..

ప్రస్తుత పరిస్థితుల్లో ఇతర పంటల సాగుతో పోల్చితే వరి పంటల సాగులో పెట్టుబడులు ఎక్కువ, లాభాలు తక్కువ అన్నట్లు మారింది. పెరిగిన కూలీల రేట్లు, ఎరువులు ధరలకు తోడు తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందుల పిచికారీతో పెట్టుబడులు గణనీయంగా పెరుగుతున్నాయి. క్రిమిసంహారక మందులు పిచికారీ చేసేందుకు ఒక్కో కూలీ రోజుకు రూ.600వరకు తీసుకుంటున్నారు. వరుసగా సోకుతున్న తెగుళ్లను నివారించేందుకు క్రిమిసంహారక మందుల పిచికారీ భారంగా మారుతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా తెగుళ్లు, పురుగు అదుపులోకి రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్లతో మందుల పిచికారీ కోసం రైతులు ఒక్కో ఎకరానికి సుమారు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

పొట్ట దశలోనే మందులు పిచికారీ చేయాలి



"మండలంలో సాగవుతున్న వరి పంటలో ప్రస్తుతం మొగి పురుగు ఎక్కువగా కనిపిస్తోంది. ప్రారంభ దశలోనే పురుగు మందులు పిచికారీ చేస్తే పంటలకు నష్టం ఉండదు. మొగి పురుగు నివారణకు కాంటాప్ హైడ్రోక్లోరైడ్ 75శాతం కాలిబుల్ పౌడర్ పిచికారీ చేసుకోవాలి. తాటాకు తెగులకు కార్బండిజమ్ 3గ్రాముల లీటర్‌నీటిలో, కాఫర్ యాక్టివ్ క్లోరైడ్ లీటర్ నీటికి 2గ్రాముల కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. పంట పొట్ట దశంలో మొగి పురుగు వరి మొగిని కత్తిరించడంతో వరి కంకులు తెల్లగా మారి తాలు పెరుగుతుంది. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు పాటించి అధిక దిగుబడులు పొందాలి.

– బి.కృష్ణసందీప్, మండల వ్యవసాయ అధికారి

ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలి

- అదనపు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి

తుంగతుర్తి : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నవంబర్-3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందని తెలిపారు. నియోజకవర్గంలో 326పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 2018లో 2,31,376 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 2,48,556 మంది ఓట్లు ఉన్నారని తెలిపారు. వాటిలో 1,24,826 పురుషులు, 1,23,722 స్త్రీలు, 08 ఇతరులు ఉన్నారని అన్నారు. 18ఏళ్లు నిండిన వారు ఈనెల 31వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. గ్రామాల్లో రాజకీయాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు ఉంటే వాటిని గుర్తించి వెంటనే తొలగించాలన్నారు. రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే నిర్వహించుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో ఎఫ్ఎస్‌టీ మూడు కేంద్రాలు, ఎస్ఎస్‌టీ మూడు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో దివ్యాంగులకు, 85ఏళ్లు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో 3,600 మంది దివ్యాంగులు ఉన్నారని అన్నారు. అత్యవసర సమయంలో రూ.50వేల నగదులు తీసుకెళ్లవచ్చని, రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తే ఆధారాలు చూపించాలన్నారు. సమావేశంలో డీఎస్పీ రవికుమార్, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, డీటీ హరిశ్చంద్రప్రసాద్, పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పఒప్పలను గుర్తించాలి

చివ్వెంల(సూర్యాపేట) : ఓటరు జాబితాలో తప్పు ఒప్పులను గుర్తించాలని సూర్యాపేట ఆర్డీఓ వీరబ్రహ్మాచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ జాబితాపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. వార్డుల వారీగా ఓటరు లిస్టును పరిశీలించి పేర్లు తప్పుగా ఉన్నా, రెండు చోట్ల ఓటు కలిగి ఉన్న వారిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో ఎలక్షన్ కోడ్ అమలుపై అవగాహన కల్పించాలని, గ్రామాల్లోకి ఎన్నికల విధుల్లో భాగంగా వచ్చిన అధికారులకు సహరించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహసీల్దార్ రంగారావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ఓటరు జాబితా సవరణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ వీరబ్రహ్మాచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 40శాతం పైన అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు, 80ఏళ్లు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ఇచ్చే అవకాశం ఉందని, దీని కోసం బీఎల్‌ఓల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 31వరకు ఓటరు జాబితాలో సవరణలు ఉంటాయని ఏమైనా తప్పులు ఉంటే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, సూర్యాపేట తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, ఆర్ఐలు మట్టయ్య, స్వప్న, సీనియర్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, ఏఎస్ఓ మధు,బీఎల్‌ఓలు ఉన్నారు.

ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ హ్యాట్రిక్ విజయం ఖాయం

నాగారం : నియోజకవర్గంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇరుగు సంసోను, పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని చర్చిలో ఎమ్మెల్యేగా కిశోర్‌కుమార్ మూడోసారి గెలవాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో దుర్గం ప్రభాకర్, బోడ లూకా (లింగయ్య), పాల్వాయి అజయ్, గుండెబోయిన పృథ్వీరాజ్, చిప్పలపెల్లి యాకోబు, చిప్పలపెల్లి బాను, పండు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అర్వపల్లి : త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గ నాయకుడు బైరబోయిన రాకేష్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను కలిసి సోషల్ మీడియా ద్వారా నియోజకవర్గంలో పదేళ్లుగా ఎమ్మెల్యే కిశోర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులను ప్రజలకు తెలియజేయనున్నట్లు, కిశోర్ హ్యాట్రిక్ విజయానికి సోషల్ మీడియా ద్వారా కృషి చేయనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు అవాస్తవం

మునగాల : మండలంలోని నేలమర్రిలో సీపీఎంకు చెందిన పలువురు మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వచ్చిన వార్తలో వాస్తవం లేదని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం, మండల కమిటీ సభ్యుడు బట్టుపల్లి ఉపేందర్, మామిడి గోపయ్య ఖండించారు. బుధవారం వారు మునగాలలో విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో సీపీఎం నుంచి ఎవరూ కాంగ్రెస్ పార్టీలో చేరలేదని, గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి తెరవెనుక రాజకీయం చేసే వ్యక్తులు మాత్రమే కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి జలగం జీడయ్య, కోటయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి



చివ్వెంల : మాట్లాడుతున్న బాలల పరిరక్షణ సమితి జిల్లా అధికారి రవికుమార్



ఆత్మకూర్ (ఎస్) : సదస్సులో మాట్లాడుతున్న వత్సవాయి లలిత

చివ్వెంల(సూర్యాపేట) : బాలికల అభివృద్ధే దేశాభివృద్ధి అని బాలల పరిరక్షణ సమితి జిల్లా అధికారి రవికుమార్ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని ఐలాపురం గిరిజన బాలికల పాఠశాలలో నిర్వహించిన బాలికల దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాలికలకు బాలల సంక్షేమ కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పథకం బేటి బాచావో-బేటి పడావో, అదే విధంగా బాలికలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలు ఉన్నతమైన లక్ష్యాన్ని కలిగి ఉండాలని, సోషల్ మీడియా ప్రభావాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ సమితి చైర్మన్ రామారావు, రామిరెడ్డి, లింగయ్య, వెంకటలక్ష్మి, సీడీపీఓ కిరణ్మయ్ ఉన్నారు.

సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలి

ఆత్మకూర్ (ఎస్) : సమాజంలో ఎలాంటి లింగ వివక్షత లేకుండా రూపుమాపాలని ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ వత్సవాయి లలిత అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు ఆడ, మగపిల్లలు అనే తేడా లేకుండా ఇద్దరిని ఒకేవిధంగా చదివించాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, వారికి చేయూతనందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వసంత, పద్మ, మంగ, ఉపేంద్ర, జ్యోతి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులు ఎన్నికలే లక్ష్యంగా ఏకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బోళ్ల కరుణాకర్

భానుపురి (సూర్యాపేట) : రానున్న అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముదిరాజులు ఏకం కావాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోళ్ల కరుణాకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 6 కారణంగా మత్స్యకారులకు ఎలాంటి న్యాయం జరగలేదని, ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చి 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్క ముదిరాజు యువకులకు మత్స్యశాఖలో సభ్యత్వం ఇవ్వాలన్నారు. దళిత బంధులాగా ముదిరాజ్ బంధు ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 50లక్షల జనాభా ఉన్న ముదిరాజులకు అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు 18అసెంబ్లీ సీట్లు, 3పార్లమెంట్ సీట్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో కోల కర్ణాకర్, చెక్కల వీరభద్రం, గంగరబోయిన శ్రీనివాస్, చెక్కల నాగరాజు, నీలం కృష్ణ, శ్రీను, జంగం వెంకటేశ్వర్లు, వెంకన్న, ఆంజనేయులు, మామిడి సత్యనారాయణ, మామిడి విజయ్, సైదులు, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

నూతనకల్ : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో భాగమైన బొడ్డెమ్మ వేడుకలను బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగకు ముందు బొడ్డెమ్మ వేడుకలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా జరుపుకుంటారు. మట్టితో ప్రకృతిలోని పూలతో అనుబంధం కల్గిన పండుగ బొడ్డెమ్మను తయారు చేసే విధానాలు ఐదు రకాల్లో ఉంటాయి. పీట బొడ్డెమ్మ, గుంట బొడ్డెమ్మ, పందిరి బొడ్డెమ్మ, బాయి బొడ్డెమ్మ, అంతరాల బొడ్డెమ్మ అని ఐదు రకాలుగా ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా కొలుస్తారు. బాద్రపద మాసంలో వచ్చే మహాలయ అమావాస్యకు ముందు వినాయక చవితి మరుసటి రోజు బహుళపంచమి నుంచి తొమ్మిది రోజులు పండుగను జరుపుకునే వారు కొందరైతే మరికొందరు ఐదు రోజులు, మూడు రోజుల దశమి నుంచి జరుపుకునే వారు మరికొందరు. ఈ పండుగను చిన్నారులైన ఆడపిల్లలు, పెళ్లికాని అమ్మాయిలతో జరిపిస్తారు. తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు భక్తిశ్రద్ధలతో గ్రామ చెరువుల్లో నిమజ్జనం చేశారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

నూతనకల్ : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మిర్యాల గ్రామానికి చెందిన బీజేపీ మాజీ సర్పంచ్ ఇరుగు చిన నాగయ్య, మాజీ ఎంపీటీసీ కొమ్ము సూరయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఉద్యమాన్ని నడిపిన సీఎం కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో మొదటిస్థానంలో నిలిచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను మరోసారి సీఎం చేసేందుకు ప్రతిఒక్కరూ బీఆర్ఎస్‌ను బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, భూరెడ్డి సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, బద్ధం ప్రశాంత్‌రెడ్డి, జక్కి పరమేష్, మన్నెం రమేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన పలువురు వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో బుధవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, దూపటి రవీందర్, నరోత్తమ్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు



రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ సైదులు, సిబ్బంది

నాగారం : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండల కేంద్రంలోని సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై మండల సరిహద్దులో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ సైదులు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి అక్రమంగా నగదు, మద్యం, నిషేధిత వస్తువులు తరలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల కమీషన్ విధించిన నిబంధనల ప్రకారం రూ.50వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లరాదని, అంతకు మించి నగదు ఉంటే వాటికి సరైన ఆధారాలు చూపించాలని అన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది ఎల్లయ్య, విజయ్, శ్రీరాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం వచ్చే మంత్రిని నిలదీయాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : గ్రామాల్లోకి ఓట్ల కోసం వచ్చే మంత్రి జగదీష్‌రెడ్డిని ప్రజలంతా నిలదీయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 9ఏళ్లలో అభివృద్ధి పనులకు పునాది వేయని మంత్రి జగదీష్‌రెడ్డి.. ఒక్కరోజులోనే 19 కులసంఘాలకు భూమి ఇచ్చి శంకుస్థాపన చేశారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి భయపడి ప్రభుత్వం వారం రోజుల పాటు హడావుడిగా ప్రారంభోత్సవాలు చేసిందన్నారు. ఇన్నాళ్లు గుర్తులేని కులసంఘాలు ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనగా గుర్తొచ్చారా అని ప్రశ్నించారు. సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలతో బీఆర్ఎస్ నాయకులు ఆగమగం అవుతున్నారని తెలిపారు. సూర్యాపేటలో అధిష్టానం టికెట్ ఎవరికీ ఇచ్చినా కలిసికట్టుగా పనిచేస్తామని, జగదీష్‌రెడ్డిని గెలవనివ్వమని అన్నారు. సమావేశంలో పీసీసీ అధికార ప్రతినిధి ధరావత్ వెంకన్ననాయక్, పార్టీ జిల్లా నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, ఎండీ.షఫీఉల్లా, వెలుగు వెంకన్న, ఎండీ.ఫరూక్, గోదల రంగారెడ్డి, స్వామినాయుడు, బంటు చొక్కయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక

సూర్యాపేట : మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ బొడ్డు మల్లయ్య తన అనుచరులు 50మందితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి బుధవారం పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ అరాచక పాలనకు విసిగి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. అనంతరం మాజీ సర్పంచ్ మల్లయ్య మాట్లాడారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో రమేష్‌రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ గత సంక్షేమ పాలన సమసమానత్వం సాగిస్తుందనే నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

నియోజకవర్గంలో బడుగుల రాజ్యం రావాలి



మల్లేష్‌యాదవ్‌ను సన్మానిస్తున్న వట్టె రేణుక

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట నియోజకవర్గంలో బడుగుల రాజ్యం రావాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వట్టె రేణుక అన్నారు. బుధవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కక్షకట్టి అణచివేస్తుందన్నారు. అగ్రకులాలదే పెత్తనం సాగుతుందని, పోలీసు వ్యవస్థను చేతిలో పెట్టుకుని ఇష్టానుసారంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో రాష్ట్రంలో పార్టీ బలంగా ఉందని, ఎవరూ అనుమానాలకు పోకుండా బీఎస్పీ వెంట నడవాలన్నారు. సూర్యాపేట పట్టణంలో సీఐ, ఎస్సైలు తమపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని, తక్షణమే వారిని ప్రభుత్వం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాగ్రామాన తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరిస్తానన్నారు. అనంతరం ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బుడిగే మల్లేష్‌యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో పార్టీ ముస్లిం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు చాంద్‌పాషా, నియోజకవర్గ అధ్యక్షుడు ఉపేందర్, గట్టు గోపి, నరేష్‌నాయుడు, మధు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న పేరాల వీరేష్

తిరుమలగిరి (తుంగతుర్తి) : త్వరలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో పటిష్టంగా ఉందన్నారు. పార్టీ టిక్కెట్ ఎవరికి ఇచ్చినా భారీ మెజార్టీతో విజయం వరిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో అధికారంలోకి వస్తుందన్నారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు ధరావత్ జమ్మిలాల్, కౌన్సిలర్ భాస్కర్, రామోజీ, రంజిత్, గణేష్, యశ్వంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

వెంకటమ్మ మృతికి సంతాపం



వెంకటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మల్లు నాగార్జున్‌రెడ్డి తదితరులు

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన ఎంసీపీఐయూ డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య తల్లి, సీపీఎం నాయకురాలు ఈదురు వెంకటమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బుధవారం సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, సంపతి వెంకన్న, ఎస్.అబ్బులు, వజ్జె సైదయ్య నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్ఎంపీ అసోసియేషన్ నుంచి ముగ్గురు సస్పెన్షన్

మునగాల : సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మండలానికి చెందిన ముగ్గురు ఆర్ఎంపీ వైద్యులను రూరల్ మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆదేశాల మేరకు అసోసియేషన్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు బుధవారం ఆర్ఎంపీ అసోసియేషన్ జిల్లా క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు ఎస్‌పీ.వెంకటప్పయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎంపీ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సరికొండ నాగరాజు, మండల మాజీ అధ్యక్షుడు లేళ్ల లింగయ్య, ఈసీ మెంబర్ వెలది వెంకటప్పాచారి గత కొంత కాలంగా సంఘం వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున సంఘం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. నేటి నుంచి వీరికి సంఘానికి ఎటువంటి సంబంధం లేదని చెప్పారు.